విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

ఫసల్ బీమాకు మోక్షం ఎప్పుడో..

-ప్రారంభంకాని నమోదు ప్రక్రియ
-స్పందించని అధికారులు
-ఆందోళనలో రైతులు
-వెంటనే ప్రారంభించాలని సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-తొండూరు: ప్రభుత్వం అమలు చేయనున్న ఫసల్ బీమాకు మోక్షం ఎప్పుడని సిపిఐ ప్రశ్నించింది. ఇంత వరకు నమోదు ప్రక్రియ ప్రారంభంకాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తంచేసింది. ఇంత వరకు అధికారులు కూడా బీమాపై స్పందించకపోవడం శోచనీయమని పేర్కొంది. కాగా బీమా కోసం నెలాఖరులోపు ప్రీమియం చెల్లించాలని నిబంధన విధించినట్లు సిపిఐ నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు మాట్లాడుతూ రైతులు కేవలం పంటలు వేయడం మాత్రమేకాదని, ఆర్థిక భద్రత కోసం భావిస్తున్నారన్నారు. ఇవేమీ పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇదిగో అదిగో అంటూ అధికారులు రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. సైట్ సమస్యలు కూడా ఇంత వరకు పరిష్కరించలేదని వారు ఆరోపించారు. ఈ విషయం రైతులు ప్రతి రోజు అడుగుతున్నా ఇంకా ఓపెన్ కాలేదని నిర్లక్ష్యం సమాధానం ఇస్తున్నారని రైతులు చెప్పినట్లు వారు వెల్లడించారు. నెలాఖరులోపు సమస్యలను పరిష్కరించకపోతే రైతులు మరింత ఆర్థిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పంటల బీమా ప్రక్రియ ప్రారంభించాలని లేదంటే రైతుల పక్షాన పోరాటానికి దిగుతామని వారు హెచ్చరించారు.

పంచాయతీ పనులను వేగవంతం చేయండి

విశాలాంధ్ర-వేంపల్లి: కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణ పంచాయతీ పనులను వేగవంతం చేయాలని మండల కన్వీనరు రామమునిరెడ్డి, ఉపాధ్యక్షులు పసుపులేటి వీరభద్రలు కోరారు. ఆ మేరకు సోమవారం ఈవో నాగభూషణంరెడ్డిని కలిసి విన్నవించార. పారిశుధ్య, మంచినీటి సమస్యలపై వారు చర్చించారు. ఈ విషయంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేలకుండా చూడాలన్నారు. స్వర్ణ పంచాయతీ పనులను పూర్తి చేసి ఇక పన్నులు,, ఇంటి కొళాయిల డిపాజిట్లు తదితర వాటిని ఆన్‌లైన్ ద్వారా వసూలు చేయాలని కోరారు. ఇందుకు ఈవో సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-వేంపల్లి: స్థానిక వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం గణిత దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్స్ నాగేంద్ర మాట్లాడుతూ రామానుజన్ అనతి కాలంలోనే పేరు ప్రఖ్యాతులు సాధించారన్నారు. గణితశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ చిన్న వయసులోనే ట్రిగనామెట్రీ తదితర అంశాలను కనుగొన్నారన్నారు. రామానుజన్ దాదాపు 3900 లకుపైగా సిద్ధాంతాలను ఫార్ములాలను కనుగొన్నారన్నారు ప్రభుత్వం ఫెలో ఆఫ్‌ది రాయల్ సొసైటీ అన్న గౌరవాలతో సత్కరించిందన్నారు. కార్యక్రమంలో గణితశాస్త్ర అధ్యాపకులు రాజారెడ్డి, సఫీద్దీన్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మాధవరావు, డాక్టర్ నాగలక్ష్మి దేవి పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కార్పొరేట్లకు మేలు చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించాలని ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి. తెలిపారు. సోమవారం స్థానిక హెూచిమిన్ భవన్ యందు ఏఐటీయూసీ కడప నగర అధ్యక్షులు పిచ్చినేని సుబ్బరాయుడు. అధ్యక్షతన కడప నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి.మాట్లాడుతూ. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్లకు తాకట్టు పెట్టి వారి ప్రయోజనాల కోసం పాలక ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ అంగన్వాడీ ఆశ తదితర ప్రభుత్వ స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ తదితర సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కడప నగర నాయకులు తారక రామారావు, రెడ్డయ్య, మల్లికార్జున, హుస్సేన్, శ్రీనివాసులు, అహ్మద్, సునీల్, హనుమంతు,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి :జిల్లా ఐడిఈఓ రవి

విశాలాంధ్ర - వీరబల్లి : ప్రతి ఒక్క విద్యార్థి సుభ్రత పాటించాలని అన్నమయ్య జిల్లా ఐడిఈఓ రవి అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వీరబల్లి నందు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "ముస్తాబు" కార్యక్రమాన్ని ప్రారంభించదానికి అన్నమయ్య జిల్లా ఎస్ రవి ముఖ్య అతిథులుగా , విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోజు వారిగా ముస్తాబు కావాలని, దీనివల్ల విద్యార్థి యొక్క ఆత్మాభిమానం, నమ్మకం, పెరుగుతాయని నలుగురిలో కలిసి స్వేచ్ఛ గా మాట్లాడే జీవించగలిగే అవకాశం ఉంటుందని, దీనివల్ల చదువుపైన దృష్టి ఏర్పడుతుంది మంచి ఫలితాలు వస్తాయని తెలియచేశారు. విద్యార్థులు కూడా ఇలాంటి క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని అలవాటు చేసుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ అజ్మతుల్లా, ప్రోగ్రాం ఆఫీసర్ జి. రఘురామయ్య ఫిజిక్స్ అధ్యాపకులు శ్యాంసుందర్ రెడ్డి అరుణమ్మ చంద్రశేఖర్ చంద్రశేఖర్ రెడ్డి భాస్కర్ చంద్రకళ రమేష్ రాజు ప్రసాద్ వేణుగోపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణం..

చురుకుగా ఏర్పాట్లు.. హాజరుకానున్న ఆది, భూపేష్..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరగనుంది. చైర్మన్ గా ఆర్ నాగరాజు, వైస్ చైర్మన్ గా ఎస్ జగదీ శ్వర్ రెడ్డి తోపాటు సభ్యులు పదవి బాధ్యతలను చేపట్టనున్నారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జరిగే ఈ అట్టహాస కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి ఆదినారాయణ రెడ్డి, తెదేపా కడప పార్లమెంటు అధ్యక్షులు సి భూపేష్ రెడ్డి హాజరుకానున్నారు. ఇక్కడ భారీ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండల కూటమి ఇన్ చార్జి తప్పెట్ల మధుసూదన్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తు న్నారు. ఈ మార్కెట్ యార్డ్ పరిధిలో ఎర్రగుంట్ల తోపాటు, ముద్దనూరు, కొండాపురం మండలాలు ఉన్నాయి. ప్రమాణ స్వీకారోత్సవానికి ఈ మూడు మండలాల నుండి పెద్ద సంఖ్యలో రైతులు, కూటమి శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉంది. అందుకు వీలుగా భోజన వసతిని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా జగదీశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివారెడ్డి, జంగం రెడ్డి, నాగరాజు దగ్గరుండి చూసుకుంటున్నారు.

ఊరెళితే సమాచారం ఇవ్వండి :సీఐ విశ్వనాధ్‌రెడ్డి సూచన

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని నివాస గృహాల యజమానులు ఏదేని పనిమీద ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా చోరీల నియంత్రణకు సహకరించాలని సీఐ విశ్వనాథ్ రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవలి కాలంలో అక్కడక్కడా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో తాము రాత్రి సమయాల్లో గస్తీని పెంచామని ప్రజలు కూడా తమకు ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచేందుకు వీలవుతుందని సీఐ విశ్వనాథ్ గుర్తు చేశారు. అనుమానితులు ఎవరైనా తమ వీధులలో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

కలసి పనిచేస్తాం.. టీడీపీని బలోపేతం చేస్తాం

రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-మదనపల్లి : రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీని రాష్ట్రంలోనే ఆదర్శంగా, కంచుకోటగా నిలబెట్టడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని రాజంపేట పార్లమెంటు నూతన ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం రాయచోటిలో రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షులను దుశ్శాలువతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూరాజంపేట పార్లమెంటులో తెలుగుదేశం పార్టీని కంచుకోటగా మలిచి, పార్టీ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకుంటామని అన్నారు. రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజక వర్గాలలోని టిడిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, అలాగే గ్రామ, మండల, నియోజకవర్గ, మున్సిపాలిటీ కమిటీలతో కలిసి కలిసికట్టుగా పనిచేస్తామని వెల్లడించారు. ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడమే తమ ప్రధాన కర్తవ్యమన్నారు.

సీతారాముల ఆలయ గోపురంపైన సిమెంట్ విగ్రహాల ఏర్పాటుకు రూ.32వేలు విరాళం అందించిన అతికారి క్రిష్ణ

విశాలాంధ్ర-సిద్ధవటం : సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీలోని యస్.కె.ఆర్ నగర్ హరిజన వాడలో వెలసిన శ్రీ సీతారాముల ఆలయ గోపురంపై సీతారామలక్ష్మణులు, హనుమంతుని సిమెంట్ విగ్రహాలు ఏర్పాటుకు రాజంపేట పార్లమెంటు జనసేన సమన్వయకర్త అతికారి క్రిష్ణ ముప్పై రెండు వేల రూపాయలు విరాళంగా తన అనుచరులతో ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్థులకు అందచేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామస్థులు మాట్లాడుతూ అతికారి క్రిష్ణ గొప్ప మనసున్న వ్యక్తి అని ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకునే వ్యక్తిత్వం ఆయనదని ఆలయాలకు, నిరుపేదలకు, నిస్సహాయకులకు సహాయం చేసే దాన గుణం కలిగిన ఏకైక నాయకుడని కొనియాడుతూ ఆయనకు ఎప్పటికీ ఋణపడి వుంటామని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై చలపాటి చంద్ర, జనసేన పార్టీ యువ నాయకుడు దేరంగుల శ్రీకాంత్, అవ్వారు రవిశంకర్, డీలర్ చెన్నయ్య, అయ్యవారయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అవినీతి చేప

రాయచోటి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు.

విశాలాంధ్ర-గాలివీడు: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయానికి సంబంధించిన అవినీతి వ్యవహారం కలకలం రేపింది. రైతు నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటూ ట్రాన్స్కో ఏఈఈ సత్యమూర్తి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరపల్లె గ్రామానికి చెందిన యర్రయ్యగారి నాగేశ్వర (39) తన పొలానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, కరెంటు పోల్లు, వైర్లు మంజూరు చేసి విద్యుత్ సరఫరా ఇవ్వాల్సిందిగా 2024లో దరఖాస్తు చేసుకున్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్ అనంతరం ఎస్టిమేషన్ ఇచ్చి, ఆ మొత్తం కూడా రైతు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడంతో రెండు వారాల క్రితం గాలివీడులో ఏఈఈ సత్యమూర్తిని కలిశారు. ఈ సందర్భంగా రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ జి. సీతారామారావు నేతృత్వంలో 22వ తేదీ సోమవారం వలపన్ని దాడులు నిర్వహించారు. సాయంత్రం 4.03 గంటల ప్రాంతంలో రాయచోటి టౌన్ వై-జంక్షన్ శివాలయం సమీపంలో, ఏఈఈ సత్యమూర్తి ఆదేశాల మేరకు ఆయన కారు డ్రైవర్ నల్లగొండు శ్రీనివాసులు (35), రైతు నాగేశ్వర నుంచి రూ.15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తదనంతరం సమీపంలోని రాయచోటి ఎస్పీఎం కార్యాలయంలో ఉన్న గాలివీడు సబ్‌స్టేషన్ ఇన్‌చార్జి ఏఈఈ సత్యమూర్తిని సాయంత్రం 4.08 గంటల సమయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో జిల్లాలో అవినీతి అధికారులపై చర్యలకు నాంది పలికినట్లైంది.

ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతుల్లో కొనసాగించాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతుల్లో కొనసాగించాలని లక్కిరెడ్డిపల్లి భారత సిపిఐ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ లక్కిరెడ్డిపల్లి కార్యదర్శి కొమ్ము ఓబులేసు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడానికి వ్యతిరేకిస్తున్నామని కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంపై తీవ్రమైన దాడి మొదలైందని పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీని ఎలా నిర్వీర్యం చేయాలో మోడీ ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. యూపీఏ ప్రభుత్వంలో తెచ్చిన చట్టాన్ని రద్దుచేసి విబి జి రామ్ జి అనే కొత్త బిల్లును పార్లమెంట్లో ఆమోదించిందన్నారు. ఈ కొత్త బిల్లు వలన ఉపాధి హామీ కూలీలకు ఒరిగిందేమీ లేదని సగటు వేతనం 240 కి తగ్గించిందన్నారు. గత యూపీఏ ప్రభుత్వంలో చట్టాన్ని తెచ్చినప్పుడు కేంద్రం 90% నిధులు రాష్ట్రాలు 10% నిధులు ఉపాధి హామీకి కేటాయించాలని నిర్వహిస్తే మోడీ ప్రభుత్వం రాష్ట్రాలు మీద భారం పెంచే విధంగా అడుగులు వేస్తుందన్నారు. అనంతరం తాసిల్దార్ క్రాంతి కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కే ఆంజనేయులు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న కార్గో సేవలు

-ఆదాయమే పరమావధిగా ముందడుగు
-పాత బస్సులన్నీ లాజిస్టిక్‌గా మార్పు
-కార్గో మాసోత్సవాల ఫలితార్థం ఇదే

విశాలాంధ్ర-పులివెందుల: ఏపీఎస్ ఆర్టీటీలో కార్గో సేవలు విస్తరిస్తున్నాయి. ఆదాయమే పరమావధిగా ముందడుగు వేసింది. పాత బస్సులన్నీ లాజిస్టిక్‌గా మార్పు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్గో మాసోత్సవాల ఫలితార్థం కూడా ఇదే. అతి తక్కువ ఖర్చుతో వేగవంతంగా వస్తువులను సురక్షితంగా చేరవేసే కార్గో సేవలను విస్తృతంగా ప్రారంభించింది. ఇప్పటికీ విజయవంతంగా కొనసాగుతున్న పార్శిల్ సేవలను మరింత విస్తరించి ఆర్టీసీ లాజిస్టిక్స్ పేరిట సరుకు రవాణా చేపట్టాలని నిర్ణయించింది. ఈ కార్గో సేవల ద్వారా రూ.2కోట్ల ఆదాయం సాధించాలనే లక్ష్యాన్ని నిర్ధయించుకుంది. లాక్‌డౌన్ ప్రభావంతో రోజు కోటి మందికి పైగా ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ తీవ్రంగా నష్టపోయింది. లాక్ డౌన్ అనంతరం కూడా పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి రాకపోవచ్చని అంచనా వేసిన ఆర్టీసీ నష్టాలను పూడ్చుకునేందుకు వినూత్న ఆలోచ నలతో ముందుకెళ్తోంది.

ప్రజా రవాణతో పెద్దగా లాభాలు ఉండవని భావించిన సంస్థ లాజిస్టిక్స్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆ మేరకు అన్ని డిపోల రీజినల్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసి ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కార్గో ఆర్డర్లు సేకరించేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే కొన్ని సంస్థలు ఆర్టీసీ సేవలను వినియోగించుకునేందుకు సానుకూలత వ్యక్తంచేసినట్లు సమాచారం. ఇక సరుకు రవాణాకు అనువుగా ఉపయోగంలోని లేని బస్సులను కార్గో వాహనాలుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేసింది. వర్క్ షాపులను తెరచి ప్రతి డిపోలో రెండు నుంచి మూడు బస్సులను కంటైనర్, ట్రక్కులుగా మార్చే ప్రక్రియపై దృష్టి సారించింది. ఇప్పటి వరకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వచ్చే కోట్లాది విలువైన ఆర్డర్లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లేవి. ఇకపై అవి ఆర్టీసీకి దక్కుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు. కార్గో సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా ఈ నెల 20వ తేదీన ప్రారంభించిన కార్గో మాసోత్సవాలను వచ్చేనెల 20వ తేదీ నిర్వహిస్తోంది. ఏది ఏమైనా ఆర్టీసీ సంస్థ అన్ని విధాలా గట్టెక్కాలని ఆశిద్దాం.

పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం 47 మందికి రూ.22.57లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యచికిత్స ఖర్చులు భరించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా రామగోపాల్‌రెడ్డి చొరవ చూపుతున్నారు. ఈ క్రమంలో 47 మంది లబ్దిదారులకు మొత్తం 22.57లక్షల విలువైన చెక్కులను ఆయనతో పాటు సతీమణి ఉమాదేవీలు లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వైద్య చికిత్స కోసం ఎవ్వరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అవసరమైన ప్రతి వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు రామగోపాల్‌రెడ్డికి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొజ్జా మైసూరారెడ్డి, తాళ్లపల్లి మహేశ్వరరెడ్డి, జ్ఞానేశ్వర్‌నాయుడు, మచ్చుమర్రి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పోలియో చుక్కల మాపింగ్ కార్యక్రమం తనిఖీ చేసిన డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్

విశాలాంధ్ర-కలికిరి : పల్స్ పోలియో చుక్కల రెండో రోజు కార్యక్రమమును జిల్లా ఆర్.బి.ఎస్.కే (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం)కోఆర్డినేటర్, పీ.పీ.ఐ కార్యక్రమం జిల్లా పరిశీలకులు డాక్టర్ శివప్రతాప్ మండలం లోని కలికిరి 2సచివాలయం పరిధిలోని ఇందిరమ్మ కాలనీ పక్కన గల హై రిస్క్ ఏరియా గుడిసెలు,కలికిరి 3సచివాలయం పరిధిలో గల కే. మాదిగ పల్లి గుట్ట పైగల గుడిసెలలో గల ఐదు సంవత్సరాల లోపు పిల్లలు నిన్నటి రోజు బూత్ లలో పోలియో చుక్కలు ఎవరైనా వేసుకోకుండా ఉంటే అలాంటి వారిని గుర్తించి పోలియో చుక్కలు వేశారు. వేసుకున్న పిల్లలకు ఇంక్ మార్కర్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఏ ఒక్క బిడ్డ కూడా పోలియో చుక్కలు వేసుకోకుండా తప్పి పోకూడదని అందుకే మొత్తం మూడు రోజులు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఇంటింటికి వెళ్లి సోమవారం, మంగళవారం లలో ఆరోగ్య సిబ్బంది విచారణ చేసి పోలియో చుక్కలు ఆదివారం వేసుకోని పిల్లలుకు వేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో మేడికుర్తి వైద్యులు డాక్టర్ కావ్యగంధ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎమ్. ఎల్. హెచ్. పీ. నాగవేణి, సీనియర్ ఏ. ఎన్. ఎమ్. నఫీసా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

యూటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా చెరుకూరు శ్రీనివాస్

విశాలాంధ్ర-వేంపల్లి: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా వేంపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పిటిటి టీచరుగా పనిచేస్తున్న చెరుకూరు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కడప జిల్లా మైదుకూరులో సోమవారం జరిగిన ఓ సమావేశంలో శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలలో ఎన్నికల అధికారిగా కార్యదర్శి లక్ష్మీరాజా, ఎన్నికల కమిటీ పరిశీలకులుగా హనుమంత్‌రావులు వ్యవహరించారు. శ్రీనివాస్‌తో పాటు ఆడిట్ మెంబరుగా పాములూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత సహాయకులుగా పనిచేస్తున్న తుమ్మలూరు వెంకటరమణ అలాగే జిల్లా కార్యదర్శిగా బిక్కన్నగారిపల్లె గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిట్టిబోయిన సుదర్శన్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చెరుకూరు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మోదీ వ్యాఖ్యలు హాస్యాస్పదం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: కాంగ్రెస్‌పార్టీ దేశ వ్యతిరేకి అని బాంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులు అసోంలో స్థిరపడేందుకు కాంగ్రెస్ అన్ని విధాలా సహకరిస్తోందని ప్రధాని మోదీ అసోంలో ఆదివారం చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య నేతలను భారత పొలిమేరల నుంచి తరిమికొట్టి భారతదేశ దాస్య శృంఖలాను ఛేదించి భారతమాతకు స్వాతంత్ర్యాన్ని సాధించడం వ్యతిరేకమా అని ప్రశ్నించారు. నవభారత నిర్మాణం కోసం హరిత, పారిశ్రామిక , సమాచార, ఎలెక్ట్రానిక్ విప్లవాలను తేవడం వ్యతిరేకమా అన్నారు. కాంగ్రెస్‌పార్టీ హిమాలయ పర్వతాల వలే ఉన్నతమైనవన్నారు. కాంగ్రెస్ అందరిపార్టీ అన్నారు. కాంగ్రెస్‌పార్టీని విమర్శించిన వారికి పుట్టగతులుండవని హెచ్చరించారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేద్దాం: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: కాలుష్య నియంత్రణకు కృషి చేద్దామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణ పరిధిలోని కడప రోడ్డు నూతనంగా ఏర్పాటు చేసిన ఏవన్ మోటారు షోరూమును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల సంఖ్య అధికంకావడం వల్ల కాలుష్యం కూడా పెరుగుతోందన్నారు. ఇక్కడ బ్యాటరీ వాహనాలను విక్రయించడం శుభపరిణామన్నారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో షోరూం యజమాని అనిల్‌బాబా, వైసిపి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, కౌన్సిలర్ కోడి రమణ, వైసిపి సీనియర్ నేత హాలు గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణలో ఆక్యులోప్లాస్టీ. ఫేషియల్ కీలక పాత్ర

కడప: నేత్ర వైద్య చికిత్సలో ఆక్యులోప్లాస్టీ అనేది ప్రత్యేకమైన విధానమని,నేత్ర సంరక్షణలో ఆక్యులోప్లాస్టీ - ఫేషియల్ కీలక పాత్ర పోషిస్తుందని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్ వీపీఈఐ) వైద్యులు, కడప క్యాంపస్ హెడ్, కన్సల్టెంట్ ఆక్యులోప్లాస్టి సర్జన్ డాక్టర్ కావ్య బెజ్జంకి తెలిపారు. ఈ మేరకు ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రాంగణంలో సోమవారం ఆక్యులోప్లాస్టీ, ఫేషియల్ చికిత్స పై జరిగిన వర్క్ షాప్ లో ఆమె మాట్లాడుతూ కంటి రెప్పల లో సంభవించు లోపాలు, కంటి నుంచి నీరు కారటం, కంటి పరిసరాలలోని లోపాలు, దృష్టి పని తీరు మరియు కంటి రూపాన్ని సవరించుటలో ఆక్యులోప్లాస్టి చికిత్స కీలక పాత్రను పోషిస్తుందన్నారు. ఆక్యులోప్లాస్టి కంటి భాగాల నిర్మాణంలోను, కంటి దృశ్య శాస్త్రంలోనూ సంపూర్ణమైన అవగాహన కలిగి ఉంటుందని, ఆక్యులో ప్లాస్టి, ఫేసియల్ రెండును చికిత్సలో అనుసంధానత కలిగి కంటి లోపాలను సవరిస్తుందన్నారు. ఇటీవల కాలంలో అనేక మంది కనురెప్పలు వాలిపోతున్నాయని, కళ్ళ వెంట నీరు కారుతున్నాదని, పెరియోక్యులర్ వృద్ధాప్య సమస్యలు మరియు కళ్ళ చుట్టూ వలయాలు ఏర్పడటం వంటి పలురకాల సమస్యలతో నేత్ర వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. కను రెప్పల లోపాలను, ఫ్టోసిస్, లాక్రిమల్ డిజార్డర్స్, కంటి గాయాలు, ట్యూమర్ వంటి వాటిని ఆక్యులో ప్లాస్టి సర్జరీ ద్వారా నివారించ వచ్చును. అంతేకాకుండా వృద్ధాప్యం కారణంగా కంటి చుట్టూ ఏర్పడే వృద్ధాప్యపు చాయలను కూడ బొటోలినమ్ టాక్సిన్ ఇంజక్షన్లు మరియు డెర్మల్ ఫిల్లర్ సహాయంతో పరిష్కరించ వచ్చును.ఈ చికిత్సలు కంటి సహజత్వానికి ఆటంకం కలుగకుండా సంరక్షించుటకు సహాయపడతాయని చెప్పారు. ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (ఎల్ వీ పీఈఐ) లో ఆక్యులోప్లాస్టి చికిత్స అందుబాటులో ఉందని చెప్పారు.

అదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర- నిమ్మనపల్లి: అదిత్య ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లెలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్స వంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డా. ఎస్. ఆసిఫ్ అలీషా సమన్వయకర్తగా విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డా. ఎస్. రామలింగ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గణితం ఇంజినీరింగ్, సాంకేతిక రంగాలతో పాటు దైనందిన జీవితంలో కూడా కీలక పాత్ర పోషి స్తుందని తెలిపారు. విద్యార్థులు తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుబ కోవాలని సూచించారు. డా. టీ. అమరనాథ రెడ్డి, విభాగాధిపతి మాట్లాడుతూ విద్యార్థుల అకడమిక్ అభివృద్ధిలో గణిత శాస్త్ర ప్రాధాన్యతను వివరించారు. గణితంలో పునాది బలంగా ఉంటే ఉన్నత చదువులు మరియు వృత్తి జీవితంలో విజయం సాధించవచ్చని అన్నారు. అదేవిధంగా డా. యు. ఆనంద రెడ్డి, గణిత శాస్త్ర ప్రొఫెసర్, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ గణితం పరిశోధన, ఆవిష్కరణలు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం గణిత క్విజ్ పోటీను నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. క్విజ్ పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది, తద్వారా విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి మరియు పోటీ స్ఫూర్తి మరింత పెరిగింది. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగానికి చెందిన అన్ని అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇలాంటి అకడమిక్ కార్యక్రమాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. చివరగా కార్యక్రమ సమన్వయకర్త డా. ఎస్. ఆసిఫ్ అలీషా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మదనపల్లెలో పోలీసుల కార్డ్ అండ్ సర్చ్ : 61వాహనాలు స్టేషన్‌కు తరలింపు

విశాలాంధ్ర- నిమ్మనపల్లి : అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు.. మదనపల్లె పట్టణం లో నేరాల నియంత్రణే లక్ష్యంగా సోమవారం తెల్లవారుజామున డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో పోలీసులు 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించారు. పట్టణంలోని పలు సమస్యాత్మక ప్రాం తాల్లో సోదాలు జరిగాయి. ముఖ్యంగా దక్నీ పేట, అగడ్తల వీధి, ఘోసియా వీధి, త్యాగరాయ వీధి, బడేమకాన్ ప్రాంతాల్లో పోలీసులు జల్లెడ పట్టారు. ఈ తనిఖీల్లో 1వ పట్టణ సీఐ మహమ్మద్ రఫి, 2వ పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సరైన పత్రాలు లేని, అనుమానాస్పదంగా ఉన్న 61 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పాత నేరస్థులు, రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి, వారిని క్షుణ్ణంగా విచారించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చేసేందుకే ఈ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించామన్నారు. ముఖ్యంగా యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా, అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన పత్రాలు కలిగి ఉండాలి. అపరిచిత వ్యక్తులు లేదా అనుమానిత వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలి" అని కోరారు. సరైన పత్రాలు చూపిన వారికి కార్డ్ అండ్ సర్చ్ ద్వారా స్వాధీనం చేసుకున్న వాహనాలను తిరిగి ఇచ్చేస్తామని ఒన్ టౌన్ సీఐ మహ్మద్ రఫి తెలిపారు.

అధునాతన సివిల్ ఇంజనీరింగ్ నిర్మాణ పద్ధతులపై అవగాహన వర్క్‌షాప్

విశాలాంధ్ర-నిమ్మనపల్లి: మిట్స్‌లోని డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగము వారు మిట్స్ అల్యూమిని వెల్ఫేర్ అసోసియేషన్, అమెరికన్ సొసైటీ సివిల్ ఇంజనీర్స్ మిట్స్ స్టూడెంట్స్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో అధునాతన సివిల్ ఇంజనీరింగ్ నిర్మాణ పద్ధతులపై మూడు రోజుల అవగాహనా వర్క్‌షాప్ ను ప్రారం భించారు.. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పూణే కి చెందిన హిల్టి టెక్నాలజీస్ కంపెనీ లో టెక్నికల్ ఇంజనీర్ గా పనిచేస్తున్న కళాశాల పూర్వ విద్యార్థి పి.కార్తీక్ పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన రంగంలో సివిల్ ఇంజనీరింగ్ పాత్ర ఎనలేనిదని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి, శాస్త్రీయంగా రూపకల్పన చేయబడిన నిర్మాణాలు, వంతెనలు, రహదా రులు, నీటి పారుదల వ్యవస్థలు, పట్టణ ప్రణాళిక - ఇవన్నీ సివిల్ ఇంజనీరింగ్ రంగానికి చెందినవన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎన్.విజయ్ కుమార్, డీన్-స్కూల్ అఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్, అల్యూమిని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగాశ్వేత, కోఆర్డినేటర్ కె. అనిత, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి

విశాలాంధ్ర-నిమ్మనపల్లి: మదనపల్లె సమీపం లోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు గణిత శాస్త్ర విభాగము వారు ఆదర్శనీయుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా జరుపు కున్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, డీన్-అకాడెమిక్స్ డాక్టర్ రామ కె కొమరగిరి మరియు మ్యాథమెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ పి.రమేష్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గణిత శాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు మరువలేనివన్నారు.ఈ ఘనత శ్రీనివాస రామానుజన్‌కే చెందుతుంది అని అన్నారు. డిసెంబర్ 22న ఆయన జన్మదినాన్ని జాతీయ గణిత దినోత్సవంగా ప్రతి ఒక్కరు జరుపుకుంటారు అని, ఆర్యభట్ట, మహావీర, బ్రహ్మగుప్త, భాస్కర 2, శ్రీనివాస రామానుజన్ వంటివారు గణితశాస్త్రంలో చేసిన పరిశోధనలు అపారం, అమోఘం అన్నారు. విద్యార్థులు గణిత శాస్త్రం పై పట్టు సాధించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యకమం లో అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని

మదనపల్లె సబ్ -కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర-మదనపల్లె: కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంపై తీవ్రమైన దాడి మొదలైందని పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీని ఎలా నిర్వీర్యం చేయాలో మోడీ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప ఆరోపించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం మదనపల్లి సబ్ -కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా తోపు కృష్ణప్ప మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వంలో తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేసి, వి బి-జి-రామ్ జి అనే కొత్త బిల్లును పార్లమెంట్ ఆమోదించిందిన్నారు.సగటు వేతనం రూ.240 తగ్గించారన్నారు. గత యూపీఏ ప్రభుత్వంలో చట్టం తెచ్చినప్పుడు కేంద్రం 90 శాతం నిధులు, రాష్ట్రాలు 10% నిధులు ఉపాధి హామీకి కేటాయించాలని నిర్ణయిస్తే, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం రాష్ట్రాల మీద భారం పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. వేతనాలు కూడా ఇంతకు మునుపు వస్తున్న రూ.260 వేతనం కాకుండా, 240 వచ్చే విధంగా కేంద్రం కుట్రలు పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, చిన్నప్ప, వెంకటరమణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలు,శిద్దన్న,నీలావతి, ఉమ ,భాగ్యమ్మ,మాధవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భవన కార్మికులకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర- నిమ్మనపల్లి : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. సిటిఎం గ్రామం, చిలకవారిపల్లికి చెందిన చందు, గణేష్ లు భవన నిర్మాణ కార్మికులు, పోతబోలు లో భవన నిర్మాణం పనులు చేసేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. పోతబోలు గ్రామ శివార్లలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే వరద, కొండారెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను హైదరాబాద్ లో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు యోగివేమన ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు నిధులు మంజూరు చేసి కళాశాల భవనాలను పూర్తి చేయాలని కోరారు. అదే విధంగా పాలిటెక్నిక్ కళాశాల భవనాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, ప్రొద్దుటూరు నియోజకవర్గ పడమటి దిక్కున పాత బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గట్కరితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ప్రొద్దుటూరు తాజా రాజకీయాలపై నారా లోకేష్ తో చర్చించారు.

రామానుజన్ కృషి ఎనలేనిది

విశాలాంధ్ర- కలసపాడు: గణితశాస్త్ర అభివృద్ధి కోసం శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు ఎనలేనివని ప్రధానోపాధ్యాయులు బి.భాస్కర్ రెడ్డి,ఉపాధ్యాయులు ఎమ్. శేఖర్ బాబు పేర్కొన్నారు.జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా కలసపాడులోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల యందు నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించిన తదనంతరం వారు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ, దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న గణితశాస్త్రం అభివృద్ధిలో రామానుజన్ చేసిన సేవలు ఎంతో అమూల్యమైనవని ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులందరూ ఆ గణిత మేధావుని స్ఫూర్తిగా తీసుకుని గణితంలో చక్కగా రాణించి, జీవితాలను బంగారుమయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, ఎస్.చెన్నయ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన బికేఆర్ గ్రూప్స్ ప్రొప్రైటర్, అధినేత విక్రం రెడ్డి (లెజండ్ విక్కీ)బృందం

- ఘనంగా స్వాగతం పలికిన సోంపల్లి సుబ్రహ్మణ్యం దంపతులు

-ఉర్రూతలూగించిన నూతన వధూవరులు ఝాన్సీపునీత్‌ల వివాహ రిసెప్షన్

విశాలాంధ్ర-పీలేరు: సోంపల్లి వారి రిసెప్షన్ ఆహ్వానం అద్యంతం ఆహ్వానితులను ఉర్రూతలూ గించింది. సోంపల్లి సుబ్రహ్మణ్యం కుమార్తె ఝాన్సీరాణి అల్లుడు పునీత్‌ల వివాహ రిసెప్షన్ కార్యక్రమం చిత్తూరు మార్గంలోని శ్రీనివాస కళ్యాణమండపంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తన మిత్రబృందం తో విచ్చేసిన బికేఆర్ గ్రూప్స్ ప్రొప్రైటర్, అధినేత విక్రం రెడ్డి (లెజండ్ విక్కీ) కి సోంపల్లి సుబ్రహ్మణ్యం దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బి విక్రం రెడ్డి తన బృందంతో వేదిక పైకి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం విచ్చేసిన ప్రతి ఒక్కరిని సోంపల్లి సుబ్రమణ్యం సగౌరవంగా ఆహ్వానించి విందు బోజనాలను వడ్డించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పవన్ ఈవెంట్స్ వారి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆద్యంతం ఉర్రూతలూగించాయి.

దురాక్రమణ ఆపాలంటూ గద్దగుంటపల్లి వాసులు వినతి

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పట్టణ సమీపంలోని ముదుపులవేముల రెవిన్యూ గ్రామం గద్దగుంటపల్లి రైతులు, ప్రజలు సోమవారం పీలేరు తాసిల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి మా గ్రామ సమీపంలో ఉండే గుట్ట దురాక్రమణ నిలుపుదల చేయాలని తాహసిల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల ముందు సదుం మండలం కు చెందిన రెడ్డప్ప అని అతనికి మా గ్రామ సమీపంలోని గుట్టలో మిలిటరీ పట్టా తీసుకొని కోళ్ల ఫామ్ నిర్మించుకున్నాడు అయితే ఆయన కాలక్రమమైన అతనికి ఇచ్చిన భూమి కంటే అదనంగా గ్రామ శివారులో ఉండే గుట్టను మిషనరీల సహాయంతో కూలదోస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ మా గ్రామ పబ్లిక్ అవసరాలకు ఉండే గుట్టను దురాక్రమణ చేస్తున్నాడని తెలిపారు.ఫిర్యాదు చేసిన వాళ్ళు గ్రామస్తులు చిన్న గంగిరెడ్డి, ఉత్తమ రెడ్డి, రాజారెడ్డి, భాస్కర్ రెడ్డి, పెద్ద రెడ్డప్ప, కమ్మిరెడ్డి, ఎల్లారెడ్డి, గండికోట వెంకటేష్, శ్రీనివాసులు రెడ్డి, హుస్సేనయ్య, బాబు,రెడ్డి కుమార్ తదితరులు పాల్గొన్నారు. వెంటనే స్పందించిన తాహసిల్దార్ శివకుమార్ సాయంకాలం నాలుగున్నర గంటల సమీపంలో తాసిల్దార్ శివకుమార్ అక్కడికి వచ్చి ఎంతవరకు పట్టా ఇచ్చారు ఎంత దురాక్రమమైంది అనే వివరాలను వారి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. . తాసిల్దార్ వెంట మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురగయ్య రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె మున్సిపల్ అంచనా బడ్జెట్ రూ.228 కోట్లు

విశాలాంధ్ర-మదనపల్లె: 2026-27 ఆర్థిక ఏడాదికి సంబంధించి మదనపల్లె మున్సిపాలిటీ అంచనా ' బడ్జెట్ రూ.228 కోట్లుగా పేర్కొన్నారు. 2025-26లో సవరించిన బడ్జెట్తో మున్సిపల్ చైర్పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల సోమవారం జరిగిన బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో ప్రవేశ పెట్టగా, కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఇందులో సాధారణ పద్దుల జమలైన మున్సిపల్ ట్యాక్సులు, అద్దెలు, వీఎల్టీ, తదితర రూ పాల్లో రూ.58.78 కోట్లు, క్యాపిటల్ పద్దులైన ప్రభుత్వం నుంచే వివిధ గ్రాంట్లు రూపంలో రూ.61.98కోట్లతో కలిపి రూ.120.76కోట్లు కాగా, ప్రారంభ నిల్వతో వెరసి మొత్తం రూ.228 కోట్లుగా చూపించారు. ఇందులో సాధారణ పద్దుల కింద ఖర్చులు రూ.43.38కోట్లు, క్యాపిటల్ పద్దుల కింద ఖర్చులు రూ.77.05 కోట్లతో కలిపి మొత్తం రూ. 120.43 కోట్లు పోను, ముగింపు నిల్వగా రూ.107.59కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో పన్నుల రూపేణ, అద్దెలతో ఆదాయం, ఫీజులు, యూజర్ ఛార్జీలు. అమ్మకం, ఆదెల నుంచి ఆదాయం. నాన్ప్లెంట్ గ్రాంట్స్, వడ్డీలు, ఇతర ఆదాయాలతో కలిపి మొత్తం రూ.58.78కోట్లు ఆదాయం వస్తుందని అంచన వేశారు. మూలధన పనుల అభివృద్ధి, గ్రాంట్లు, చందాల ద్వారా రూ.61,98 కోట్లు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగుల జీతభత్యాలు, అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు, ఆపరేషన్ మెయిన్టెనెన్స్, ఇతర దని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగుల జీతభత్యాలు, అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు, ఆపరేషన్ మెయిన్టినెన్స్, ఇతర ఖర్చులు కలిపి రూ.43.38 కోట్లుగా పేర్కొన్నారు. మూలధన పనుల అభివృద్ధి, స్వచ్ఛఆంధ్ర, ఎంపీ, ఏసీడీపీ, పార్కులు, ఆటస్థలాలు, ఎ.ఎస్.సి.గ్రాంటు, ఎస్సీ సబ్జెన్ గ్రాంటు, ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్టీపీ), అదర్వేట్ గవర్నమెంట్ గ్రాంటు, అర్బన్వెల్త్ సెంటర్గ్రాంటు, ఎస్.ఎఫ్.సి, ఎస్టీ సబ్జెన్, షెల్టర్ఫర్ అర్బన్ హెూంలోస్, 15వ ఆర్థికసంఘం నిధులు రూ.77.05 కోట్లుగా ఖర్చులు ఉంటాయని అంచనా బడ్జెట్లో వివరించారు. ఇక మున్సిపాలిటీకి ప్రజల నుంచి వివిధ రూపాల్లో పన్నుల రూపేణ వచ్చే సాధారణ నిధులు(జనరల్ ఫండ్)లో 40శాతం ఆయా వర్గాల అభివృద్ధికి కేటాయింపులు చేపట్టారు. ఇందులో మురికివాడల అభివృద్ధిలో భాగంగా ఎస్సీలకు 17.10శాతం, ఎస్టీలకు 5.33శాతం, ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ విభాగానికి 5.33శాతం, ఏకలాంగులకు 3శాతం చొప్పున అంచనా బడ్జెట్లో మొత్తం రూ.6.16 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. అలాగే నీటి సరఫరాకు 20శాతం నిధులు, మురికినీటి కాలువల నిర్మాణానికి 13శాతం, రోడ్ల నిర్మాణానికి 19శాతం, వీధిదీపాలకు 7శాతం, పార్కుల అభివృద్ధికి 10శాతం. మార్కెట్లు, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, టాయిలెట్లు, యూరినల్స్, తదితర విభాగాలకు 17శాతం చొప్పున మొత్తం రూ.15.40కోట్లు ఖర్చు చేయాలని చూపించారు. మున్సిపల్ చైర్పర్సన్ వి.మనూజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

టిడిపి సమన్వయకర్తను పరామర్శించిన నాయకులు

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి టిడిపి పార్టీ సమన్వయకర్త సీడ్స్ మల్లికార్జున నాయుడును పిటిఎం మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్ సోమవారం కలిసి పరామర్శించాడు. కమ్మపల్లిలో మల్లికార్జున నాయుడు తల్లి చనిపోవడంతో పరామర్శించి అంత్యక్రియలో పాల్గొన్నారు. పరామర్శించిన వారిలో మాజీ సింగిల్ విండో చైర్మన్ సంపతి కోట కిట్టన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సురేష్, పాఠశాల చైర్మన్ రాము, పెనుగొండ శ్రీనివాసులు, టిడిపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలలో వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-పొద్దుటూరు: వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి మాతృమూర్తి రాచమల్లు రత్నమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రొద్దుటూరు రామేశ్వరం బైపాస్ లో గల విశ్వ ప్రేమ వృద్ధాశ్రమం, అమ్మానాన్న వృద్ధాశ్రమం మరియు విజయేశ్వరి వృద్ధాశ్రమాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమల్లు కిరణ్ కుమార్ రెడ్డి, రాచమల్లు రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పి.వి.రావు ఆశయ సాధనకు ముందుకు సాగాలి- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్

విశాలాంధ్ర-పీలేరు: పి.వి.రావు ఆశయ సాధనకు ముందుకు సాగాలని నేడు మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పి.వి. రావు 20వ వర్ధంతి సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లి కార్జున ఆధ్వర్యంలో స్థానిక మాలమహానాడుకార్యాలయంలో ఆయన చిత్ర పటానికిపూలమాలవేసి ఘనంగానివాళులర్పించారు ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను పునికిపుచ్చుకున్న పి.వి. రావు ఉమ్మడి మాలమహానాడును బలోపేతం చేసి మాలల ఐక్యతకు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు దుబ్బా శ్రీకాంత్,మాల మహానాడు సీనియర్ నాయకులు కె.మురగేష్, మండల సహాయ కార్యదర్శి అర్పింటి రెడ్డెప్ప, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తూరు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భువన విద్యాలయంలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పీలేరు: సోమవారం పీలేరు పట్టణంలోని శ్రీ భువన విద్యాలయంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత పితామహుడు, భారతదేశ గర్వకాంణమైన మహానుభావుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ గణిత శాస్త్ర నమూనాలను ప్రదర్శించి, గణితంలోని సూత్రాలు, సిద్ధాంతాలను సులభంగా వివరించారు. ఈ నమూనాలు సందర్శకులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపాల్ గుణ లక్ష్మి మాట్లాడుతూ జాతీయ గణిత దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ గణిత దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర-పీలేరు: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తాటిపర్తి గంగాధర్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జన్మదినం జరుపుకున్నామన్నారు.గణితంలో విశేషమైన సేవలు అందించారని తెలిపారు. దానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 2012 సంవత్సరం నుండి ఆయన జయంతిని జాతీయగతం దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. రామానుజన్ రాయల్స్ సొసైటీ ఫెలోషిప్ పొందిన అతిపెన్న వయసుకుడని తెలియజేశారు. ఈయన కు చిన్నప్పటి నుంచి గణితంపై మక్కువ ఎక్కువగా ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, రమణయ్య ,అశోక్ కుమార్ ,ఫరూక్ సురేంద్ర పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి..!

జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోపు తప్పనిసరి గా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయంకేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి ఎంప్లాయిమెంట్ మరియు టూరిజం శాఖ అధికారి సురేష్, డిప్యూటీ కలెక్టర్లు వెంకటపతి, శిరీష, రంగస్వామి మరియు ఎస్.ఎస్.ఏ.పిఓ. ప్రేమంత్ కుమార్, మెప్మా పిడి కిరణ్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటం-ఒంటిమిట్ట మండలాలు కడప జిల్లాలోనే కొనసాగాలనే డిమాండ్

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలు కడప జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమంలో భాగంగా, నిర్వహించిన భారీ ర్యాలీకి సంఘీభావం తెలిపిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు, ఈరోజు స్థానిక నాయకులు, జేఏసీ ప్రతినిధులు మరియు ప్రజలతో కలిసి కడప జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సిద్ధవటం-ఒంటిమిట్ట మండలాలు భౌగోళికంగా, పరిపాలనా పరంగా కడప జిల్లాతోనే అనుసంధానమై ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ మండలాలను ఇతర జిల్లాల్లోకి మార్చడం వల్ల ప్రజలకు అనవసర ఇబ్బందులు ఎదురవుతాయని, దైనందిన అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.ప్రజల ఆకాంక్షలు, వాస్తవ పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యాలను గౌరవిస్తూ ఈ మండలాలు కడప జిల్లాలోనే కొనసాగించేలా ప్రభుత్వం స్థాయిలో సానుకూల నిర్ణయం రావాల్సిన అవసరాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల న్యాయమైన డిమాండ్‌కు న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున అవసం మైన ప్రతినిధిత్వం కొనసాగిస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కలిసిన మండల నాయకులు

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని గతంలో ఆలయ ఫిట్ పర్సన్ గా బాధ్యతలను చేపట్టి ఆలయ అభివృద్ధి పనులు కొంతకాలం నుండి ఆగడంతో ఆ పనులను తిరిగి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి పనులు జరిగే విధంగా చూడాలని ఇటీవల జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్ బాలాజీని బ్రహ్మంగారిమఠం తెలుగుదేశం పార్టీ యువ నేత కానాల మల్లికార్జున రెడ్డి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు, పూజ శివ యాదవ్ జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో శాలువలతో సత్కరించారు. అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెరుగు నాగేంద్ర. పట్టాల శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉపాధి పథకాన్ని తిరస్కరించాలి

జిల్లా కలెక్టర్ కు కాంగ్రెస్ పార్టీ వినతి పత్రం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కేంద్రంలోని మత విద్వేష ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉపాధి కరువు చేసేందుకు తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ' పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరస్కరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ను అమలు చేసే విధంగా కొత్త పథకాన్ని తిరస్కరించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కొత్త పథకాన్ని రాష్ట్రంలో పూర్తిగా నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం లో కేంద్రంలో భాగస్వామ్యైన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కొత్త ఉపాధి చట్టాన్ని తిరస్కరించాలని పునరుద్ఘాటించారు. లేని పక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళ నలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు హమీద్ , మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శులు కమల్ భాష, రఫీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

4 రోజుల్లోనే ప్రభుత్వ పాఠశాలకు కొత్త కళ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పజలకు, విద్యార్థులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో తెలుగుదేశం నాయకులు పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి , కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి ఎప్పుడూ ముందుంటారు అనడానికి ఈ ఘటనే నిదర్శనం. ఇటీవల మన కడప - స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా కడప నగరం 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ (ఆర్ట్స్ కాలేజ్ ఎదురుగా) లోని ఎం పి పి స్కూల్ ను సందర్శించినప్పుడు, పాఠశాల పరిస్థితి సరిగా లేకపోవడాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి , ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారి మాధవి గమనించారు. పాఠశాలను బాగు చేస్తామని ఆరోజే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కేవలం 4 రోజుల్లోనే పాఠశాలకు రంగులు వేయించి, సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం ఆ పాఠశాలను శ్రీనివాసరెడ్డి , మాధవి సందర్శించి, జరిగిన పనులను పరిశీలించారు. పాఠశాల కొత్త రూపు సంతరించుకోవడం పట్ల విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంచి, వారు మంచి విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలవాలని ఆశీర్వదించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని శ్రీనివాసరెడ్డి , మాధవి తెలియజేశారు.

ఆధునిక విద్యలో ప్రాచీన విజ్ఞానం "వేదిక్ మాథెమాటిక్స్"

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : స్థానిక అక్కాయపల్లె సాయిబాబా పాఠశాల యందు "వేదిక్ మాథెమాటిక్స్" యందు ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పాఠశాల సి.ఇ.వో మరియు స్థానిక కార్పోరేటర్ "యం.వి. శ్రీదేవి " మెడల్స్ ను అందజేశారు. ఈ సంధర్భముగా శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులలో గణితంపై ఆసక్తిని పెంచేందుకు ఈ "వేదిక్ మాథెమాటిక్స్" ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ గణిత విధానము ద్వారా తక్కువ సమయములో లెక్కలు (కాలిక్యులేషన్స్) సులభముగా పరిష్కరించే సామర్థ్యాన్ని పెపొందించడం మరియు పరీక్ష సమయములో సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, గణితం పై ఉన్న భయాన్ని కూడా పోగొట్టి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరముగా ఉంటుందని తెలిపారు. పాఠశాలలో "వేదిక్ మాథెమాటిక్స్" అందుకోసమే ప్రవేశపెట్టామని, ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులందరికీ మెడల్స్ ను అందజేసి వారిని అభినందిస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరా ప్రభుత్వ ధ్యేయం..!

"కరంటోళ్ల జనబాట" పోస్టర్లు, ఆన్‌లైన్ పోర్టల్‌ను ఆవిష్కరణ:జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : నిరంతరాయ విద్యుత్ సరఫరాను ప్రజలకు అందించడమే లక్ష్యంగా.. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో "కరంటోళ్ల జనబాట" అనే వినూత్న కార్యక్రమానికి సంబంధించి విద్యుత్ శాఖ వారు ప్రచురించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించి, ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా.. కడప జిల్లాలో వినూత్నంగా "కరంటోళ్ల జనబాట" అనే కార్యక్రమానికి విద్యుత్ శాఖ వారు శ్రీకారం చుట్టడం అభినందనీయం అన్నారు. విద్యుత్ వినియోగదారులకు గరిష్ట స్థాయిలో సేవలు అందించడమే ఈ పోర్టల్ ప్రధాన లక్ష్యమన్నారు. సంస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని, సంతృప్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలను ఆయన తెలియజేస్తూ.. ప్రతి మంగళ, శుక్రవారాల్లో విద్యుత్ శాఖ అధికారులు నేరుగా గ్రామాలు, వాడలు మరియు హాబిటేషన్లను క్షేత్రస్థాయి పర్యటనల చేసి సందర్శిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు మరియు ఇతర విద్యుత్ వ్యవస్థ లోపాలను అధికారులు స్వయంగా గుర్తిస్తారు. అంతేకాకుండా అధికారులు గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిశీలిస్తారన్నారు. క్షేత్ర స్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే "కరంటోళ్ల జనబాట" ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిం చేందుకు చర్యలు చేపడతారన్నారు. విద్యుత్ శాఖవారు చేపట్టిన ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

"ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి:ఎస్పీ

విశాలాంధ్ర-కడప : వై.ఎస్.ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 127 ఫిర్యాదులు పీజీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వైభవంగా శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం

గోవిందనామస్మరణంలతో ఆర్మోగిన శివాలయ ప్రాంగణం

విశాలాంధ్ర - సుండుపల్లె : వేద పండితులు అర్చక స్వాముల మంత్రోచ్చారణలు మంగళవాయిద్యాల భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాసుని కళ్యాణం మండల కేంద్రంలోని విరూపాక్షాలయంలో కన్నుల పండుగగా జరిగింది.తిరుపతి తిరుమల పాదయాత్రలో భాగంగా ప్రతి సంవత్సరం కలియుగ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని గోవింద మాలధారణ భక్తుల ఆనవాయితీగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అదేవిధంగా సోమవారం శివాలయ ప్రాంగణంలో శ్రీనివాసుని కళ్యాణం సుండుపల్లె వినాయక నగర్ కు చెందిన తాపీమేస్త్రి నంద్యాల వెంకటరమణ కుటుంబ సభ్యులు కలియుగ వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా పురువీధులలో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో ఎల్ఈడి కాంతులతో,కళ్యాణాన్ని వీక్షించేందుకు ఎల్ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేసి లైవ్ టెలికాస్ట్ చేయడమే ఈ ఏడాది ప్రత్యేకతగా చెప్పాలి.ఆలయ ప్రాంగణం మొత్తం పందిళ్లు,ఆలయ ముఖ ద్వారాన్ని యంతో సుందరంగా ఉత్సవ శోభను తలపించేవిదంగా ఏర్పాటు చేసి కళ్యాణ వేదికపై శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీనివాసునికి వేద పండితులు సాంప్రదాయ బద్ధంగా జిలకర బెల్లం,కంకణ ధారణ, అమ్మవార్లకు మంగళ సూత్రాల ధారణ వంటి వాటితో కళ్యాణక్రతువు నిర్వహించారు.కళ్యాణం అద్యంతం భక్తుల గోవింద నామ స్మరణలతో శివాలయ ప్రాంగానం మారు మ్రోగింది.కళ్యాణో త్సవానికి 3000 మంది పైగా భక్తులు హాజరై కళ్యాణాన్ని తిలకించారు. సుండుపల్లె మండల వాసులే కాకుండా పీలేరు,తిరుపతి, వీరబల్లే,సంబేపల్లె,రాయచోటి ప్రాంతాల వాసులు హాజరై కనుల విందుగా వీక్షించారు. ఇందులో భాగంగా హోమం నిర్వహించారు.స్వామి అమ్మవార్ల కళ్యాణంలో భాగంగా సోమవారం ఉదయం పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వార్లకు అభిషేకపూజలు నిర్వహించారు.కళ్యాణంలో భాగంగా మహిళలచే అమ్మవారికి కుంకుమార్చన చేయించారు.శ్రీనివాసుని కళ్యాణానికి వచ్చిన భక్తులకు సుండుపల్లెకు చెందిన కొండారెడ్డి వెంకటేష్ కుటుంబ సభ్యులు కమనీయమైన విందు భోజనం ఏర్పాటు చేశారు.తీపు పదార్థాలతో పాటు వివిధ రకాల వంటలను చేయించి భక్తులకు వడ్డించారు.నిర్వాహకులు ధర్మరాజు,రెడ్డయ్య రాజు, వెంకటరమణ,భాస్కర, చంద్రమౌళి,శ్రీనివాస్ రెడ్డి,రెడ్డప్ప, ప్రసాద్, ఈశ్వరయ్య, దొరస్వామి నాయుడు,గోవింద మాల ధారణ భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతుల్లో కొనసాగించాలి: సిపిఐ

విశాలాంధ్ర - రాయచోటి : రాయచోటి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడానికి వ్యతిరేకిస్తున్నామని కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంపై తీవ్రమైన దాడి మొదలైందని పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీని ఎలా నిర్వీర్యం చేయాలో మోడీ ప్రభుత్వం కసరత్తు చేస్తుందని యూపీఏ ప్రభుత్వంలో తెచ్చిన చట్టాన్ని రద్దుచేసి వి బి జి రామ్ జి అనే కొత్త బిల్లును పార్లమెంట్లో ఆమోదించిందని ఈ కొత్త బిల్లు వలన ఉపాధి హామీ కూలీలకు ఒరిగిందేమీ లేదని సగటు వేతనం 240 కి తగ్గించిందని గత యూపీఏ ప్రభుత్వంలో చట్టాన్ని తెచ్చినప్పుడు కేంద్రం 90% నిధులు రాష్ట్రాలు 10% నిధులు ఉపాధి హామీకి కేటాయించాలని నిర్ణయిస్తే మోడీ ప్రభుత్వం రాష్ట్రాలు మీద భారం పెంచే విధంగా అడుగులు వేస్తుందని ఈ చట్టాన్ని ప్రజల ముందు బయట పెట్టకుండా ప్రజలు మేధావులు పౌర సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు స్వచ్ఛంద సంస్థలు రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోకుండా ఆమోదం తెలిపారని కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు, అనంతరం తాసిల్దార్ నరసింహ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు, ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కే ఓబులేసు, సురేంద్ర, ఆంజనేయులు, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

కలసి పనిచేస్తాం- టిడిపిని బలోపేతం చేస్తాం

విశాలాంధ్ర - రాయచోటి : రాష్ట్రంలోనే ఆదర్శంగా, కంచుకోటగా నిలబెట్టడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని రాజంపేట పార్లమెంటు నూతన ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ స్పష్టం చేశారు.సోమవారం రాయచోటిలో రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షులను దుశ్శాలువతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.అనంతరం ప్రసాద్ బాబు మరియు పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటులో తెలుగుదేశం పార్టీని కంచుకోటగా మలిచి, పార్టీ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకుంటామని అన్నారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు పార్టీ అధిష్టానాన్ని సంప్రదించి, వారి మార్గదర్శకత్వంలో పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాజంపేట పార్లమెంటులో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడమే తమ ప్రధాన కర్తవ్యమని సుగవాసి ప్రసాద్ ,పఠాన్ ఖాదర్ ఖాన్ తెలిపారు.

ఉచిత గ్యాస్ ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రామాపురం : మండలంలోని నీలకం ఠరావుపేట లో సోమవారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోరాష్ట్రంలో ఏ ఒక మహిళ కట్టెల పొగతో బాధ పడకూడదు అని ఉద్దేశంతో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులైన ప్రతి మహిళ ఇంటికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ లు అందిస్తున్నారు మహిళలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఉచిత గ్యాస్ కనెక్షన్ మూడు సిలిండర్లు ఉచితబస్సు ప్రయాణం హామీలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి అండదండలుగా నిలవాలన్నారు ఈ కార్యక్రమంలో నీలకంఠ రావు పేట ఉప సర్పంచ్ మహమ్మద్ భాషా టిడిపి నాయకులు దేవదర్శన్ రెడ్డి రామకృష్ణ గౌడ్ చెన్న కృష్ణారెడ్డిఅజం పెంచల్ రెడ్డి భాష వల్లి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 53 వ జన్మదినోత్సవ వేడుకలు విజయవంతం కావడానికి అహర్నిశలు కృషి చేసిన సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు అభిమా నులకు రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసి అభిమానాన్ని చాటుకున్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవైనా లోపాలు ఉంటే సమన్వయంతో సరిదిద్దుకుని అందరం కలిసికట్టుగా పని చేసి జగన్ ఆశయాన్ని నెరవేరద్దావ న్నారు.మీ అందరి కృషితో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అందరికీ అందుబాటులో ఉంటానన్నారు.ఈ సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దా బాబుల్ రెడ్డి, వైయస్ అన్వర్ భాష, సిహెచ్ రమేష్ బాబు,నందా బాల,ఇనమాల మహేష్, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, వత్తలూరు సాయికిషోర్ రెడ్డి,రాజా గని కొరముట్ల చంద్రశేఖర్,దామర్ల శిద్దయ్య, డివి రమణ,కుంబా రమణ,డమ్ము రఘు, గునిశెట్టి రమేష్, సుంకేసుల రఫీ,షఫీ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన ఏపీ ఎన్జీజీఓ'స్ నాయకులు

విశాలాంధ్ర -రాయచోటి : రాయచోటి నందు గల మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర రవాణా,యువజన,క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కడప జిల్లా అధ్యక్షులు .శ్రీనివాసులు , రాష్ట్ర ఉపాధ్యక్షులు కా. వై. ప్రసాద్ యాదవ్,కడప జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య ని నూతనముగా ఎన్నికైన అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యం.వేణుగోపాల్ రెడ్డి , కార్యదర్శి జె శ్రీనివాసన్, కోశాధికారి నాగేశ్వర రావు కార్యవర్గ సభ్యులు మహాదేవ,, గణేష్, ధీరజ్, సిద్దయ్య, హరి ప్రసాద్, సందీప్ కుమార్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రాయచోటి తాలూకా కోశాధికారి బి.దేవేంద్ర తదితరులు పాల్గొని గజమాల తో ఘనంగా సత్కరించడమైనది.

అధ్యక్షునికి ఘన స్వాగతం పలికిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర -మైలవరం : కడప జిల్లా టిడిపి అధ్యక్షునిగా భూపేష్ రెడ్డి పేరును అధికారకంగా ప్రకటించిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వస్తున్న భూపేష్ కు సోమవారం సాయంత్రం జిల్లా సరిహద్దు యైన పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామం వద్ద జిల్లాలోని తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. క్రేన్ సహాయంతో భూపేష్కు గజమాలవేసి బాణసంచ పేలిస్తూ ఘనంగా పూలు చల్లుతూ స్వాగతం పలికి అభినందనలతో ముంచేశారు.ఈ సందర్భంగా తెలుగు తమ్ములను ఉద్దేశించి భూపేష్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షునిగా నియమించడంతో తన బాధ్యత మరింత పెరిగిందని

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలో గ్రామ పంచాయతీ వారిగా గ్రామప్రజల సమస్యలపై నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజా పరిషత్ అధికారి రామచంద్రారెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులతో మండల స్థాయి అధికారులతో సమావేశం ఉంటుందని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు వీరనారాయణరెడ్డి జడ్పిటిసి సభ్యులు, మరియు జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామ గోవిందా రెడ్డి, మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతారని వారు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ సర్పంచులు ఎంపిటిసి సభ్యులు కోఆప్షన్ సభ్యులు తప్పనిసరి హాజరు గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

ఉర్దూ విద్యా అభివృద్ధికి సహకరిస్తాం

- ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: ముస్లిం ఉర్దూ విద్యా అభివృద్ధికి సహకరిస్తాం అని కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి జగడంపల్లి ముస్లింలకు భరోసా ఇచ్చారు.ప్రస్తుతం జగడంపల్లి లో ఉన్న ఉర్దూ స్కూల్ బాలికలకు సరిపోవడం లేదు, అదనంగా మరో గది కావాలని స్థానిక ముస్లిం నాయకులు కార్యకర్తలు వరలక్ష్మి దృష్టికి తీసుకుపోవడంతో తక్షణం స్పందించి ముక్కా ఫౌండేషన్ ద్వారా అదనపు గది నిర్మిస్తామని హామీ ఇచ్చారు.అ హామీ మేరకు సోమవారం ఉదయం జగడంపల్లి లోని ఉర్దూ స్కూల్ భవనంపైన అదనపు గది నిర్మాణం కొరకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లిం పిల్లలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.మతాలకు అతీతంగా విద్య, వైద్యం, సంక్షేమ అభివృద్ధికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ కట్టుబడి ఉందన్నారు.ముస్లిం మహిళలు వరలక్ష్మి ని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డిసిఎంఎస్ చైర్మెన్ యర్రగుండ్ల జయప్రకాష్, క్లస్టర్ ఇంఛార్జి మైనార్టీ నాయకులు మౌలా పఠాన్,లాల్ బాష, సయ్యద్ మెహతాజ్ బేగం, జిక్రీ, జుబైర్,మస్తాన్, ఆరిఫుల్లా,ఫజుల్, గులామ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ దృష్టికి మండల సమస్యలు

శాసనసభ్యులు పుట్టా

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం మండల సమస్యలను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్యమంత్రి తనయుడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. బ్రహ్మంగారిమఠం మండలంలోని భూ అక్రమణలు అరికట్టే విధంగా భూ సర్వే కార్యక్రమాన్ని అధికారుల ద్వారా సర్వే చేయించాలని భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మండలానికి మంజూరైన నవోదయ పాఠశాలల నిర్మాణంపై మండలంలో అధికంగా పేదలు ఉన్నారని పేదల భూ పంపిణీ పై త్వరలో అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని అసైన్మెంట్ కమిటీ ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి భూమిని పంపిణీ చేసే విధంగా చూడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వీలైనంతవరకు సమస్యలను పరిష్కరిస్తామని త్వరలో భూ సమస్యలు పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. అదే విధంగా పాఠశాల పైన కూడా ప్రత్యేకంగా దృష్టి పెడతామని మైదుకూరు పాఠశాలలో ఏదైనా వసతులు కల్పించాలని బ్రహ్మంగారిమఠం నవోదయ పాఠశాల పూర్తిచేసి పేద విద్యార్థులకు చదువు అందించే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా బ్రహ్మంగారిమఠం అన్ని విధాల అభివృద్ధికి కృషి చేయాలని వారు తెలిపారు. సమస్యలన్నీ త్వరితగతిన పూర్తిచేసే విధంగా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రత్యేకంగా అభినందనలు శాసనసభ్యులు సుధాకర్ యాదవ్ తెలియజేశారు.

ఎంపీని కలిసిన మేయర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర మేయర్ పాక సురేష్ కుమార్ కడప ఎంపీ అవినాష్ రెడ్డిని కలిసి సత్కరించారు పులివెందుల లోని వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు కడప నగర మేయర్ పాక సురేష్ కుమార్ మేయర్ గా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి , కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు బాలస్వామి రెడ్డి, సుబ్బరాయుడు ,శంషీర్, చాక్లెట్ గౌస్, నాయకులు పవర్ అల్తాఫ్, రెడ్డయ్య,వాసు ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వైఎస్ఆర్సిపి పులివెందుల నాయకుడు ప్రతాప్ రెడ్డి మేయర్ ని ,డిప్యూటీ మేయర్ , కార్పొరేటర్లు, ఇంచార్జి లు నాయకులను సన్మానించారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నూతన బిల్లు రద్దు చేసే వరకు పోరాటం

కడప కలెక్టరేట్ వద్దవామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు ఆందోళన

విశాలాంధ్ర-కడప రూరల్ : గ్రామ సీమలే దేశానికి పట్టుకొమ్మలు, గ్రామ స్వరాజ్యం రావాలని కలలు గన్న జాతిపిత మహాత్మా గాంధీ పేరుపై ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సమూల మార్పులు చేసి మహాత్మా గాంధీ ఆలోచనలకు సమాధి చేసే నూతన బిల్లు రద్దు చేసే వరకు పోరాడుతామని సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగిన వామపక్షాల రాష్ట్రవ్యాప్త ఆందోళనలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ ఓబయ్య సీఎం వి రమణయ్య ఆర్ఎస్పి సుబ్బరాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ద హక్కు గా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. దేశంలో ఆకలి పేదరికం దారిద్రం నిరుద్యోగం కరువు వలసలు ఆత్మహత్యలు తీవ్రతరమవుతున్న పరిస్థితుల్లో రోజురోజుకు పట్టణీకరణ గల్ఫ్ దేశాలకు వలసలు మానాన్ని అమ్ముకునే దౌర్భాగ్య స్థితి ఉన్నవాడికి లేని వాడికి అంతరం పెరిగిన నేపథ్యంలో యుపిఎ ప్రభుత్వంపై ఆనాడు వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపు దిద్దుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మౌళిక స్వభావం కేంద్ర ప్రభుత్వం మారుస్తున్నది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ ర్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధిహామీ పథకానికి "రాంరాం" పలకనున్నది. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని (సప్లయిని) బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమే. పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకే. ఉపాధి కార్డులను హేతుబద్ధీకరిస్తున్నామన్న పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను మినహాయిస్తున్నారు. ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారు. వ్యవసాయ పనులు రద్దీగా ఉండే సమయాలలో 60 రోజుల ఉపాధిని నిలుపుదల చేయడం వలన అత్యంత అవసరమైన సమయాలలో గ్రామీణ కార్మికులకు పని నిరాకరించబడుతుంది. తద్వారా వారిని భూస్వాములపై ఆధారపడేలా చేయడం గర్హనీయం అన్నారు. యంజిఎన్ఆర్ఈజిఎగా ఉన్న ఈ పథకం పేరును మార్చడం మహాత్ముడిని అవమానించడమే. ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుంది. మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారు. ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు కేంద్రం ఇస్తున్న 90% నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు నాలుగు వేలకోట్లు అదనపు భారం పడనుంది. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా వున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని వామపక్షాలు కోరుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్ వెంకట శివ రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సి సుబ్రహ్మణ్యం, వి వీరశేఖర్, అన్వేష్, శ్రీనివాసులు రెడ్డి, పి చంద్ర శేఖర్, వేణుగోపాల్ యం వి సుబ్బారెడ్డి, ఎం విజయలక్ష్మి, కె సి బదుల్లా, మద్దిలేటి, గంగసురేష్ , శంకర్ నాయక్, పి మస్తాన్, నాగేశ్వర్ రావు, మునయ్య, ఇమ్మాన్యుయేల్,పి వి రమణ, వడిగే వెంకట రమణ, భాగ్యలక్ష్మి, అరుణ్, నారాయణ, బ్రహ్మం, సునీల్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

వెల్ విషర్స్ " గిరీష్ కి "రాష్ట్ర స్థాయి అవార్డు

విశాలాంధ్ర-నిమ్మనపల్లి: అఖిల భారత విద్యార్థి పరిషత్ 44 వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 19,20,21 వ తేదీలలో ఒంగోలు లో ఘనంగా నిర్వహించారు. 21 వ తేదీన నిర్వహించిన ముగింపు సభలో ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఎబివిపి అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేసిన కీ.శే. శ్రీ జనమంచి గౌరీ శంకర్ గారి జ్ఞాపకార్థం ప్రతి ఏటా రాష్ట్ర సభల్లో సేవాకార్యక్రమాలలో విశేష ప్రతిభ కనపరచిన యువత కి "జనమంచి గౌరీ శంకర్ యువ పురస్కార్" పేరు తో అవార్డు అందజేస్తున్నారు. ఈ ఏడాది ఈ అవార్డు కి "మదనపల్లె" కి చెందిన "వెల్ విషర్స్" సేవా సంస్థ నిర్వాహకులు "గిరీష్ నల్లగుట్ల" గారిని ఎంపిక చేశారు. అవార్డు భాగంగా ప్రశంస పత్రం , జ్ఞాపిక , యాభై వేల రూపాయలు నగదు బహుమతి గా అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు కి ఎంపిక చేసిన కమిటీ కి , ఎబివిపి సభ్యులకు , హరిబాబుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వెల్ విషర్స్ సభ్యులు గిరీష్ , అరుణ్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ ద్వారా శునకంటి ఆంజమ్మకు ఒక లక్ష చెక్కు

విశాలాంధ్ర-నిమ్మనపల్లి : సిఎంఆర్ఎఫ్ ద్వారా శునకంటి ఆంజమ్మకు ఒక లక్ష రూపాయలు చెక్కును తెలుగుదేశం సీనియర్ నాయకుడు విశ్రాంత డిఎస్పి కే సుకుమార్ బాబుఅందజేశారు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు విశ్రాంత డిఎస్పి కే సుకుమార్ బాబు, 24 వ వార్డు అధ్యక్షులు ధర్మతేజ, 25 ఆ వార్డు అధ్యక్షులు లక్ష్మణ్ రాజు, 24 వ వార్డు మైనార్టీ జనరల్ సెక్రెటరీ అప్రోచ్ బాషా, తెలుగుదేశం నాయకులు రవికుమార్ శెట్టి లతో కలిసి అందజేశారు. ఈ విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు మాట్లాడుతూ అనారోగ్యంతో వున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడి ముఖ్య మంత్రి సహాయ నిది క్రింద ఆర్థిక సహాయం అందిస్తోందని గుర్తు చేశారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండేది, ఆదు కొనేది కేవలం తెలుగుదేశం పార్టీనే మాత్రమే అన్నారు. కావున్న ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

అన్నమయ్య జిల్లా మెప్మా పిడి లక్ష్మీదేవి

విశాలాంధ్ర -రాజంపేట: మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి సఖి సురక్ష రక్షణ కవచం అన్నారు. ప్రధానంగా మహిళల్లో పెరుగుతున్న బ్రెస్ట్ క్యాన్సర్, రక్తహీనత, థైరాయిడ్, షుగర్ వంటి వ్యాధులను వివరించేందుకు సీఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే మదనపల్లిలో కూడా మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ అనుసంధానంతో రిజిస్ట్రేషన్ చేసి రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వారి నమూనాలను ల్యాబ్ కు పంపిస్తామన్నారు. రిపోర్టు రాగానే వారికి సమాచారం అందజేసి ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యుల సూచన మేరకు సూచనలు సలహాలు అందిస్తామన్నారు. సఖి సురక్ష ద్వారా అన్ని రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డి ఆర్ ఎల్ మనీ, చంద్రమౌళి, సిటీ మిషన్ మేనేజర్లు అయ్యవారయ్య, గోపీనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.52116 విరాళం

విశాలాంధ్ర -నందలూరు : మండలంలోని నాగిరెడ్డి పల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయం నిర్మాణానికి ముక్కర అరుణ్ జ్యోతి, ముక్కర హరినాథ్ దంపతులు 52,116/- రూపాయలు ఒక్క పిల్లర్ నిర్మాణవ్యయానికి విరాళంగా గురు స్వామి ఏనుగుల బాలాంజనేయులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వామి బాలాంజనేయులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలని కోరారు. దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాడపూరి సుబ్బరాయుడు, హేమలత, తోట శివశంకర్, రాచూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన పుష్పలత

విశాలాంధ్ర -ముద్దనూరు : స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఇటీవలే ఏకగ్రీవంగా ఎన్నికైన పుష్పలత ఎంపీపీ గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తనకు ఇచ్చిన బాధ్యతలు సమర్ధమంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ సందర్బంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధి కొరకు తన సాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.ఎంపీపీ గా తనకు ఈ కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి,కోడిగండ్ల పల్లె వెంకట రెడ్డి, మణికంఠ రెడ్డి,వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతుల్లో కొనసాగించాలి - సిపిఐ

విశాలాంధ్ర-రామాపురం : సిపిఐ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కత్తి సురేంద్ర, మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడానికి వ్యతిరేకిస్తున్నామని కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంపై తీవ్రమైన దాడి మొదలైందని పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీని ఎలా నిర్వీర్యం చేయాలో మోడీ ప్రభుత్వం కసరత్తు చేస్తుందని యూపీఏ ప్రభుత్వంలో తెచ్చిన చట్టాన్ని రద్దుచేసి వి బి జి రామ్ జి అనే కొత్త బిల్లును పార్లమెంట్లో ఆమోదించిందని ఈ కొత్త బిల్లు వలన ఉపాధి హామీ కూలీలకు ఒరిగిందేమీ లేదన్నారు. సగటు వేతనం 240 కి తగ్గించిందని గత యూపీఏ ప్రభుత్వంలో చట్టాన్ని తెచ్చినప్పుడు కేంద్రం 90% నిధులు రాష్ట్రాలు 10% నిధులు ఉపాధి హామీకి కేటాయించాలని నిర్ణయిస్తే మోడీ ప్రభుత్వం రాష్ట్రాలు మీద భారం పెంచే విధంగా అడుగులు వేస్తుందని ఈ చట్టాన్ని ప్రజల ముందు బయట పెట్టకుండా ప్రజలు మేధావులు పౌర సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు స్వచ్ఛంద సంస్థలు రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోకుండా ఆమోదం తెలిపారని కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు, అనంతరం తాసిల్దార్ వెంకటేశ్వర్లు కు వినతి పత్రం సమర్పించారు, ఈ కార్యక్రమంలో పి ఆంజనేయులు ఎస్ షబీర్, ఓబులేసు పాల్గొన్నారు.

దేవాలయం వద్ద మసీద్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర-గాలివీడు: గాలివీటి గంగమ్మ ఆలయం సమీపంలో జరుగుతున్న మజీద్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జిల్లా కలెక్టర్,ఎస్పీ లకు వినతిపత్రం అందజేశారు. అన్నమయ్య జిల్లా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొట్లమిట్ట శ్రీనివాసులు గాలివీడు మండల ప్రజల అభ్యర్థన మేరకు కలెక్టర్‌ను ఆశ్రయించారు.గాలివీడు పట్టణ శివారు ప్రాంతంలో కుషావతీ నదీ తీరాన వెలసిన అతి పురాతన గాలివీటి గంగమ్మ ఆలయానికి సుమారు 100 మీటర్ల దూరంలో కొందరు ముస్లిం సోదరులు ఉద్దేశ్యపూర్వకంగా మజీద్ నిర్మాణ పనులు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.హిందూ దేవాలయానికి అతి సమీపంలో ముస్లింల ప్రార్థనా మందిరం నిర్మాణం జరిగితే భవిష్యత్తులో ఉత్సవాలు, ఇతర కార్యక్రమాల సమయంలో మతపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అంతేగాక శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమి సర్వే నంబర్ 1011-1లో ఉన్న 35 సెంట్ల మాగాణి భూమికి అనుకుని మజీద్ నిర్మాణం జరుగుతుండటంతో దేవుని మాన్యం భూమి ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు.ఈ సమస్యపై తక్షణమే జోక్యం చేసుకుని మజీద్ నిర్మాణ పనులను నిలిపివేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

మహాత్మా గాంధీ పేరు రూపుమాపడం దుర్మార్గం

విశాలాంధ్ర-ములకలచెరువు : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువు మండలం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి అంజన్నప్ప ములకలచెరువు మండలం తాసిల్దారి గారికి వినత పత్రం అందజేస్తూ అంజన్న మాట్లాడుతూ కార్మికులు శ్రామికులు కష్టపడి పోరాటం చేసి మన భారతదేశంలో సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిరువయం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కంకణం కట్టుకున్నాయని పేదల పొట్ట కొట్టడానికి కంకణం బద్ధలై మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తీసివేయడానికి కంకణము కట్టుకున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం మన్మోహన్ సింగ్ సోనియా గాంధీ పేదల ఆకలి బాధలు గుర్తించి పేదల పోరాటాన్ని గుర్తించి కార్మికుల కోసం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది ఆనాడు దేశ ప్రజల కోసం ఎంతోమంది నాయకులు తెల్లదొరలపై పోరాడి స్వతంత్రము సంపాదించిన నాయకులు పేర్లు రూపకల్పన చేసి నామకరణ చేసిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రూపుమాపడానికి కంకణం కట్టుకున్న కూటమి ప్రభుత్వానికి సిగ్గు లేదని అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా నిరసనలు ప్రదర్శనలు చేపట్టడం జరిగింది కూటమి ప్రభుత్వం పాలకులు స్వతంత్ర సమరయోధుల ఈ పథకానికి కొత్త పేరు ప్రకటించుకున్న వారి సమరయోధుల ఎవరికోసం ఈ యొక్క పథకాన్ని పేర్లు మార్చి ఉపాధి హామీ పథకాన్ని నిలువరే చేయడానికి కంకణం కట్టుకున్న రూ భారత కమ్యూనిస్టు పార్టీ అన్ని కార్మిక సంఘాలతో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడకుండా కార్మికులు శ్రామికుల కష్టాన్ని దోపిడీ చేయకుండా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిదంగా కొనసాగించాలి లేనిపక్షములు కార్మికులు రైతాంగముతో ఏకమై కూటమి ప్రభుత్వాన్ని కాలగర్భముల కడపడానికి పెద్ద ఎత్తున ప్రచారము చేసి రాబోయే రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించుతామని హెస్తరిస్తున్న ఈ కార్యక్రమములో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చౌడప్ప సిపిఐ ములకలచెరువు మండలం సహాయ కార్యదర్శి నిజాంద్దీన్ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు శ్రీదేవి ఎల్లప్ప ఉత్తన్న చంద్ర రమణప్ప శంకరమ్మ లక్ష్మీదేవి పాల్గొన్నారు

కరుణించవా.. ఆపద మొక్కులవాడా.!

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలి

విశాలాంధ్ర -రాజంపేట: అన్నమయ్య కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర కోరారు. సోమవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కావలసిన అన్ని సదుపాయాలు రాజంపేటలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో జిల్లా కేంద్రాన్ని పార్లమెంట్ కేంద్రమైన రాజంపేటను కాకుండా రాయచోటిని ప్రకటించడంతో ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు రాయచోటి వద్దు.. రాజంపేట ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన ర్యాలీకి పట్టణంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. కరుణించవా.. ఆపద మొక్కులవాడా..కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి.. నీ భక్తుడైన తాళ్లపాక అన్నమాచార్యులు 32 వేలు సంకీర్తనలు రాసి మీపై ఉన్నటువంటి భక్తిని చాటుకున్నారు. అటువంటి తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలమైన రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకటేశ్వర స్వామి, అన్నమయ్య రూపాలలో ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దారి పొడుగునా సాగిన ర్యాలీకి ప్రజలు భారీ ఎత్తున సంఘీభావం తెలిపారు. వినూత్నంగా చేపట్టిన ర్యాలీకి జేఏసీ నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మహమ్మద్ హుస్సేన్, నరసింహ, పగిడి సుబ్బరాయుడు, దొంతం వెంకటసుబ్బయ్య, వరమయ గారి సుబ్రహ్మణ్యం, విడగొట్టు రమణ, వెంకట స్వామి, రాజు, మల్లికార్జున, రంగస్వామి, కేశవ, నన్నే సాహెబ్, జరపటి వెంకటేష్, గణేష్, రమేష్, సురేష్, జమాల్ భాష తదితరులు పాల్గొన్నారు.

అద్వైత గురుకులంలో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని అద్వైత గురుకులం పాఠశాలలో గణిత శాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేస్తూ సోమవారం గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పాఠశాల చైర్మన్ డా. బి. ఇంద్ర సేనా సూచనల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు గణిత ప్రయోగ ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ,గణితం మన దైనందిన జీవితంలో ఎంత కీలకమైన పాత్ర పోషిస్తుందో విద్యార్థులకు వివరించారు. గణితం ద్వారా సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, నిర్ణయాత్మక ఆలోచన పెరుగుతుందన్నారు.అంతేగాక గణితం మన ఆలోచనా శక్తిని పెంపొందించే అద్భుతమైన శాస్త్రమని,ప్రతి విద్యార్థి గణితాన్ని ఆసక్తితో నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించేందుకు గణిత ప్రశ్నోత్తరాలు, మోడల్స్ ప్రదర్శన, గణిత క్రీడలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి,బాబ్జి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టమోటా మార్కెట్లో 15 కేజీల క్రేట్స్ అమ్మలు పరిచాలి

విశాలాంధ్ర-గుర్రంకొండ : టమోటా మార్కెట్ యార్డ్ నందు ప్రతి మండి యాజమాన్యం జనవరి 15వ తేదీ నుంచి 15 కేజీల చిన్న క్రేట్స్ అమలుపరచాలని మార్కెట్ వైస్ చైర్మన్ తరిగొండ నౌషాద్, డైరెక్టర్ భయ్యా రెడ్డి, పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద క్రేట్స్ వల్ల రైతుల నష్టపోతున్నారని రైతులకు న్యాయం చేసుటకు కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు ప్రతి ఒక్కరూ వీటిపై దృష్టి సారించి ఆవులు పరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఛరిష్మా ఉన్న నాయకుడు జగన్

విశాలాంధ్ర-చెన్నూరు : ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కమలాపురం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మళ్ల సాయి కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రెండవ సచివాలయం పరిధిలో జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల నాయకులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాదరణ ఉన్న నాయకుల్లో మొదటిస్థానంలో ఉన్న నాయకుడు మా జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మళ్ల మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని విడగొట్టొద్దు..

విశాలాంధ్ర -రాజంపేట: ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉన్న తమను పంచాయతీలుగా విభజన చేసి విడగొట్టవద్దని ఆకేపాడు ప్రజలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం డి.ఎల్.పి.ఓ మస్తాన్ వల్లి నేతృత్వంలో, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా ఆధ్వర్యంలో ఆకేపాడు గ్రామపంచాయతీని నాలుగు పంచాయతీలుగా విభజించేందుకు గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పంచాయితీ విభజనకు ససేమిరా అన్న ప్రజలు ఇప్పటి లాగానే కొనసాగాలని అడిగిన వెంటనే ముక్తకంఠంతో అవునంటూ బిగ్గరగా సమాధానం చెబుతూ నినాదాలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రజల నుంచి సంతకాలు స్వీకరించి ఆమోదం తెలిపారు.

విధేయతకు పట్టం.. భూపేష్‌కు అధ్యక్ష పదవి

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : తెదేపా కడప జిల్లా అధ్యక్ష పదవి సి.భూపేష్ రెడ్డికి కట్టబెట్టడం తమకు సంతోషం కలిగిస్తోందని కూటమి సీనియర్ నాయకులు కోడూరు కలం కుంట్ల శివశంకర్ రెడ్డి, ఎర్రగుంట్ల తుంగ మోహన్ అన్నారు. అధ్యక్ష పదవి భూపేస్‌కు ప్రకటించిన అనంతరం సోమవారం జరిగిన ర్యాలీలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ శంకర్ మాట్లాడుతూ పార్టీ పట్ల విధేయత, అంకితభావం, క్రమశిక్షణ, ప్రతిపక్షంలో చేసిన పోరాటాలు భూపేష్ కు కలిసి వచ్చాయని గుర్తు చేశారు.

భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-చిట్వేల్ : చిట్వేలి మండల కేంద్రంలోని పాత చిట్వేలిలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, ఆలయంలో సోమవారం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలచే కుంకుమార్చన కార్యక్రమాన్ని జరిపించారు. భక్తులకు మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాల వినియోగాన్ని నిర్వహించారు.

కువైట్లో మృతిచెందిన శిరీష కుటుంబానికి ప్రవాసాంధ్రుల ఆర్థిక సహాయం



విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : వీరబల్లి మండలానికి చెందిన శిరీష అనే వివాహిత ఇటీవలే కువైట్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందింది. సోమవారం ప్రవాస ఆంధ్రులు రూ.2,10,000 శిరీష కుటుంబ సభ్యులకు సీఐ కృష్ణరాజు నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డబ్బులు వృధా చేయకుండా పాప పేరుతో ఫిక్స్ డిపాజిట్ చేయాలని అలాగే ఆ పాప బాగోగులు, చదువు పట్ల ప్రవాస ఆంధ్రులు మరింత ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపినట్లు ఆయన తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ప్రవాసాంధ్రులు తెలిపారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శిరీష కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



విశాలాంధ్ర -కొండాపురం : గణిత మేధావి శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా కొండాపురం లోని శివసాయి హై స్కూల్‌లో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.పాఠశాల విద్యార్థులు తయారుచేసిన గణిత ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు.ఈ కార్యక్రమం లో స్టేట్ బ్యాంకు మేనేజర్ మణిహార్, ఏపీజీబీ మేనేజర్ పవన్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి లు వాటిని పరిశీలించి విద్యార్థులను ప్రశంశించారు.

పట్టుదలకు మరో రూపం వైయస్ జగన్.. ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ తుంగ వెంకట్రామ్

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల : పట్టుదలకు మరో రూపం, నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దం మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ చీఫ్ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని స్థానిక మున్సిపల్ 5 వ వార్డు కౌన్సిలర్, ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ తుంగ వెంకట్రామ్ రెడ్డి అన్నారు. జగన్ పుట్టినరోజును పురస్కరించుకొని ఇక్కడ జరిగిన పలు కార్యక్రమాలలో తుంగ పాల్గొన్నారు. అనంతరం తుంగ ఆధ్వర్యంలో తిప్పలూరు గ్రామంలోనిఎద్దుల పెద్ద శేషమ్మ అనాధ ఆశ్రమంలోని అభాగ్యులకు దుప్పట్లు, తినుబండారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుంగ ఆశ్రమంలోని అనాధలను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. తుంగ ఇంటి వద్ద కూడా సందడి నెలకొంది. పలువురు వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా తుంగ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకోవడంలో జగన్ ముందు ఉంటారని, చిరునవ్వే ఆయన ఆభరణమని, ప్రజలే ఆయన బలమని గుర్తు చేశారు. తండ్రి ఆశయ సాధన కోసం, పేదవాడికి అండగా నిలవడం కోసం, ఎంతటి కష్టాన్ని అయినా భరించడంతోపాటు ఎంతటి వారినైనా ఎదిరించే ధీరత్వం కలిగిన నాయకుడు జగన్ అని తుంగ కొని ఆడారు. మాట తప్పని, మడమతిప్పని ముక్కుసూటి తత్వం కలిగిన నేతగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారని తుంగ పేర్కొన్నారు. జననేతగా ఖ్యాతి గడించిన జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని తుంగ జ్యోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ బాధ్యులు తమ్మిశెట్టి బాలయ్య, జయ రామకృష్ణారెడ్డి తో పాటు నాగిరెడ్డి, సాంబశివారెడ్డి, జక్కు చేన్న కృష్ణారెడ్డి, రమణారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, రాజారెడ్డి, సంజీవరెడ్డి తో పాటు తుంగ అభిమానులు, శ్రేయోభిలాషులు, వైకాపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారత గడ్డపై సిపిఐకి వందేళ్ళు..పేదల పక్షాన అలుపెరిగిన పోరాటం

సిపిఐ శత వార్షికోత్సవ జెండా ఆవిష్కరణలో ఎల్.నాగ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-కడప రూరల్ : భారతదేశ రాజకీయాలలో సిపిఐ వందేళ్ల ప్రజాప్రస్థానం గర్వించదగిందని, పేదల పక్షాన అలుపెరిగిన పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే అని, స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని ఎన్డీఏ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సిపిఐ వందేళ్ళ వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం నగరంలో ఎన్టీఆర్ నగర్-అంబేద్కర్ నగర్ వద్ద సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925 , డిసెంబర్ 26 ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ లో ఆవిర్భవించిన సిపిఐ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చినటువంటి ఏకైక పార్టీ సిపిఐ నేనన్నారు. దేశంలో వందేళ్ళ చరిత్ర కలిగిన పార్టీలు సిపిఐ కాంగ్రెస్ పార్టీలు మాత్రమేనన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అనేక మంది త్యాగాలు చేశారని, జైలుకెళ్లారని, ప్రాణాలు సైతం తృణపాయంగా అర్పించారన్నారు. బ్యాంకుల జాతీయ కరణ రాజభరణాలు రద్దు భూ సంస్కరణ చట్టం సాధించిందన్నారు. స్వాతంత్ర్యానంతరం కూడా సిపిఐ కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా 10 లక్షల ఎకరాలకు పైబడి సాగు భూమిని ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందని అదే సమయంలో ఈ వందేళ్ళ ల్లో 4 లక్షల మంది కామ్రేడ్లు దేశ ప్రజల కోసం ఉద్యమాలలో ఊపిరి వదిలినట్లు వారు పేర్కొన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్నదనీ మండిపడ్డారు. 2026 జనవరి 18న ఖమ్మం లో జరిగే సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కడప నగర సౌత్ జోన్ నాయకులు పగడపూల మల్లికార్జున, సిపిఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ, సహాయ కార్యదర్శి,మద్దిలేటి, ఎన్టీఆర్ నగర్, నారాయణ, రాముడు, దస్తగిరమ్మ బ్రహ్మం, భాగ్యలక్ష్మి, గద్దం శీను, ప్రదీప్, సాలమ్మ, బుజ్జి, తిరుపతమ్మ, సుంకమ్మ, పుష్పమ్మ, రాజు, దావీదు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.